అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం



ఈ ఫోటోలో ఉన్న మహిళ పేరు అనసూయమ్మ, రత్నగిరి పాత ఊరులో నివాసం ఉంటున్నారు. ఈమెకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో రూ.1,51,262 లబ్ధి చేకూరింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.97,498, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.38,500, వైఎస్సార్ ఆసరా కింద రూ.3,526, వైఎస్సార్ పంటల బీమా కింద రూ.3,252, వైఎస్సార్ సున్న వడ్డీ (డ్వాక్రా) కింద రూ.3,761, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.4,725 అందింది. ఇంతలా సాయం చేసిన జగనన్నను ఎప్పటికీ మర్చిపోనని అనసూయమ్మ ఆనందం వ్యక్తం చేసింది.

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే తిప్పేస్వామి



రత్నగిరిలో పథకాల బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

రొళ్ల: రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రత్నగిరి పంచాయతీ కేంద్రంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, సర్పంచ్ చిన్నరంగప్ప, ఎంపీటీసీ జగదీష్ బాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, నాయకుడు సిద్ధరామప్ప తదితరులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ లబ్ధి పొందిన వారికి బుక్‌లెట్లను అందజేశారు. ముందుగా గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీ దేవి, కాళికాంబకామటేశ్వర ఆలయాల్లో పూజలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయని అభివృద్ధి పనులతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నాలుగేళ్ల పాలనలో 95 శాతానికి పైగా నెరవేర్చారని కొనియాడారు.

విద్య, వైద్య రంగానికి పెద్ద పీట..

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ పెద్దపీట వేస్తున్నారన్నారు. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలను అన్ని హంగులతో నిర్మించి.. మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. అదే విధంగా దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి వలంటీర్ల సహాయంతో నేరుగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమ కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. అర్హత ఉండి కూడా ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే సచివాలయాల్లో దరఖాస్తులు పెట్టుకోవాలని సూచించారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్నారు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి నాలుగేళ్లుగా దక్కుతున్న ప్రజాధారణ చూసి ప్రతి పక్షనాయకులు ఓర్వలేక పోతున్నారని ధ్వజమెత్తారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తూనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సకాలంలో ఎరువులు, ఔషధాలు, విత్తనాలు అందించడం జరుగుతుందన్నారు. మహిళల అభ్యున్నతికి వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరాతో పాటు అమ్మఒడి, పిల్లల చదువు కోసం జగనన్న విద్య కానుక, జగనన్న విద్య దీవెనతో పాటు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా నాణ్యమైన భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుంది..

తాను పెట్టే ప్రతి మీటింగ్‌లో నలభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే మాజీ సీఎం చంద్రబాబుకు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను చూసి చంద్రబాబుకు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీలు కలిసివచ్చినా వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేరన్నారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మోతిరాంనాయక్, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రంగప్ప రాజు, గంగప్ప, యర్రగుంటప్ప, పుట్టప్ప, నాగప్ప, బడప్ప, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజనేయులు, ఎంపీడీఓ రామరావు, ఈఓఆర్డీ కిష్టప్ప, ఎంఈఓ శ్రీధర్, ఎస్‌ఐ వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, ఏపీఎం నాగరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం
(గరిష్ఠం)

హిందూపురం	: 35.0
పెనుకొండ	: 38.0
మడకశిర	: 35.0

ఘనంగా వాసవీమాత విగ్రహ ప్రతిష్ట



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని డీబీ కాలనీలో గురువారం తెల్లవారుజామున అష్టలక్ష్మీ సమేత వాసవీమాత విగ్రహ ప్రతిష్ట వేడుకగా జరిగింది. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా బెంగళూరు వాసవీ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామి విచ్చేశారు. ఈ సందర్భంగా నూతన ఆలయంలో ప్రతిష్ఠించిన అష్టలక్ష్మీ సమేత వాసవీమాత దేవతామూర్తుల విగ్రహాలు, ఆలయ గర్భగుడి గోపుర కలశాలకు పూజలు చేశారు. సాయంత్రం వెండి రథంలో అమ్మవారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ఊరేగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, పట్టణ ప్రముఖులు ఆలయంలో పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆలయ కమిటీ నిర్వాహకులు భరత్‌రాజు, నాగరాజు, రఘునందన్ గుప్తా, నాగరాజు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీరభద్రుడికి వెండి కిరీటం బహూకరణ



దాతలను సన్మానిస్తున్న దృశ్యం

లేపాక్షి: ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయానికి అనంతపురం జిల్లాలోని గోనుగుంట్ల గ్రామానికి చెందిన రామానాయుడు కుమారుడు గోనుగుంట్ల యుగంధర్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం రూ.80 వేలు విలువైన వెండి కిరీటం అందజేసినట్లు ఆలయ కార్యనిర్వహణధికారి నరసింహమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ ఈఓ సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్‌ఓ మృతికి సంతాపం

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లిలో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఓ శ్రీనివాసులు ఉరి వేసుకుని మృతి చెందడంతో గురువారం సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. సంతాపం తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి వీఆర్‌ఓ ఎంతగానో శ్రమించేవారని కొనియాడారు.

తహసీల్దార్ హసీనా సుల్తానా బాధ్యతల స్వీకరణ



హిందూపురం టౌన్: మండల నూతన తహసీల్దార్‌గా హసీనా సుల్తానా గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని నెలలుగా హిందూపురం తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండగా.. ఇటీవల బదిలీలలో భాగంగా రొళ్ల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న హసీనా సుల్తానాను హిందూపురం తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐ, వీఆర్‌ఓలు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు శివ, అసిఫ్, రామచంద్ర, నాయకులు దాదు, నాగరాజు, మహేష్ తదితరులు తహసీల్దార్ హసీనా సుల్తానాను సన్మానించారు.

బదిలీ వీఆర్వోలకు సన్మానం

మడకశిర(అగళి): ఇటీవల బదిలీ అయిన వీఆర్వోలను గురువారం అగళి రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. అదే విధంగా కొత్తగా వచ్చిన సిబ్బందికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ జిలానీ, రెవెన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలి



అగళిలో వేరుశనగ విత్తనాన్ని పరిశీలిస్తున్న మండల స్పెషలాఫీసర్ చంద్రశేఖర్

మడకశిర(అగళి): ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అన్ని శాఖల అధికారులు అధిగమించాలని మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ కోరారు. గురువారం అగళిలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అగళిలోని ఆర్బీకేను సందర్శించి వేరుశనగ విత్తన కాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని కోరారు. రైతులకు నాణ్యమైన వేరుశనగ విత్తనం అందించాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా ఇంత వరకు రైతులకు పంపిణీ చేసిన వేరుశనగ విత్తన కాయల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ శేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జపానంద సేవలు అభినందనీయం



ఎమ్మెల్యే వెంకటేశ్‌కు వివేకానంద చిత్రపటాన్ని అందిస్తున్న స్వామి జపానంద

పావగడ: స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రం వ్యవస్థాపకుడు స్వామి జపానంద అందిస్తున్న ఆరోగ్య సేవలు అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేశ్ కొనియాడారు. గురువారం ఆయన ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న శారదా కంటి చికిత్స విభాగం, అధునాతన యంత్రోపకరణాలను పరిశీలించారు. క్షయ, కుష్టు వ్యాధుల నివారణ చికిత్స విభాగాల్లో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వెంకటేశ్‌ను స్వామి జపానంద ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుదేశ్ బాబు, శంకరరెడ్డి, లాయర్ భగవంతప్ప, బత్తినేని నాని, టెంకాయల రవి పాల్గొన్నారు.

చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

హిందూపురం టౌన్: క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో శానిటేషన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ వ్యాప్తంగా 22 వాహనాల్లో చెత్త సేకరణ జరుగుతోందన్నారు. చెత్త సేకరణకు సంబంధించి తప్పనిసరిగా యూజర్స్ చార్జీలు వసూలు చేయాలన్నారు. ప్రతి వార్డులోనూ 100 శాతం యూజర్స్ చార్జీలను ఆయా సచివాలయ కార్యదర్శులు వసూలు చేయాలన్నారు. అదే విధంగా పురపాలక సంఘం వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న వ్యాపారులపై జరిమానాలు విధించి, చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువలపై ప్రత్యేక దృష్టి సారించి, ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు 11న ప్రవేశ పరీక్ష

మడకశిర(అగళి): అగళి మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చక్రధారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఆలయ జీర్ణోద్ధరణకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: మున్సిపల్ పరిధిలోని సూగూరు సడ్లపల్లిలో వెలసిన పురాతన ఆంజనేయ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, పునః నిర్మాణానికి గురువారం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయమే ఆంజనేయ స్వామి ఆలయ పునః నిర్మాణానికి అర్చకులు మంత్రోచ్చారణలతో పూజలను ప్రారంభించారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో చరిత్ర కలిగిన ఆలయాన్ని పునః నిర్మిస్తున్నట్లు తెలిపారు.

నేటి 'గడప గడపకూ మన ప్రభుత్వం' వాయిదా

అమరాపురం: మండలంలోని నిద్రగట్ట గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం జరగాల్సిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ మునిస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆదేశాలతో కార్యక్రమాన్ని వాయిదా వేశామన్నారు. కార్యక్రమం నిర్వహించే తేదీని మళ్లీ ప్రకటిస్తామన్నారు.

రాగి సాగుపై దృష్టి సారించండి



రొళ్ల: బీజీ హళ్లి ఆర్‌బీకేలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రాజ్యలక్ష్మి

రొళ్ల: బోరు బావులతో పాటు వర్షాధారం కింద ఖరీఫ్‌లో ఎక్కువ విస్తీర్ణంలో రాగి సాగు చేసుకోవాలని ఏఓ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బీజీ హళ్లి, మల్లినమడుగు, ఎం.రాయాపురం ఆర్‌బీకేల్లో రాగి పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. నీటి వసతి కలిగిన భూముల్లో, వర్షాధారం కింద రాగి సాగు చేసే రైతులకు రాయితీతో రాగి విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా అందిస్తామన్నారు. అదేవిధంగా పండించిన రాగి పంటను ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి, కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సదాశివప్ప, శారదమ్మ, నరసింహప్ప ముద్దరాజు, వీఏఏ ప్రసన్నమార్, ఆర్‌బీకే ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: రైతులు రాగి పంట సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొడికొండ ఆర్బీకేలో రైతులతో సమావేశమయ్యారు. రాగి సాగుపై అవగాహన కల్పించారు. రాగి సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రైతులు పండించిన రాగులను రైతు భరోసా కేంద్రాల ద్వారా పౌరసరఫరాల శాఖ అనుసంధానంతో మద్దతు ధరతో కొనుగోలు చేస్తామన్నారు.

మడకశిర(అగళి): రైతులు రాగి సాగుపై దృష్టి పెట్టాలని ఏఓ శేఖర్‌నాయక్ కోరారు. గురువారం మండలంలోని కోడిపల్లి ఆర్బీకేలో రాగి సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం రాగి సాగును ఎక్కువగా ప్రోత్సహిస్తోందన్నారు. ఉచితంగా రాగి విత్తనాలను సరఫరా చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్బీకే అధికారులు వసంతనాయక్, నాగన్న, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్ బీమా' వందశాతం పూర్తి చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: మండలంలో వైఎస్సార్ బీమాను వందశాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. గురువారం మండలంలోని హేమావతి సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులు ఎక్కడికి వెళ్లారని, మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేశారా అని ఆరా తీశారు. ప్రతి ఉద్యోగి సచివాలయం నుంచి బయటికి వెళ్లేటప్పుడు తప్పక ఏ పనికి ఎక్కడికి వెళ్తున్నామె తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. కేవలం సంతకాలు చేసి బయటికి వెళ్లడం సరికాదన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నిద్రగట్ట 21 శాతం, కె.శివరం 22, వి.అగ్రహారం 40, హేమావతి 54, మద్దనకుంట 55, బసవనపల్లి 57, అమరాపురం 63, ఆలదపల్లి 63, తమ్మడేపల్లి 66, హలుకూరు 66 శాతం వైఎస్సార్ బీమా పూర్తి చేశారన్నారు. చాలా సచివాలయాల్లో 50 శాతం కంటే తక్కువగా ఉందని తెలిపారు. రెండు రోజుల్లో 90 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ అధికారులు వలంటీర్ల సహకారంతో బీమా నమోదును వేగవంతం చేయాలని కోరారు.

అర్హులకు పథకాలు అందాలి



పైడేటి గ్రామంలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సరస్వతి

పరిగి: గ్రామ సచివాలయానికి వచ్చే ప్రతి ఒక్కరికీ సంతృప్తికరమైన సమాధానం చెప్పాలని, దీనికై ప్రతి ఒక్క సచివాలయ ఉద్యోగి బాధ్యతాయుతంగా పని చేయాలని ఎంపీడీఓ సరస్వతి సూచించారు. మండలంలోని పైడేటిలో గురువారం ఆమె పర్యటించారు. తొలుత సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. తప్పనిసరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాల్సిందేనని స్పష్టం చేశారు. అదే విధంగా సర్వేలన్నీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి మెనూ ప్రకారం పిల్లలకు భోజనం వడ్డిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. అక్కడి రికార్డుల పరిశీలన అనంతరం భోజన తయారీని పరిశీలించారు. అక్కడి నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడులో భాగంగా జరుగుతున్న ప్రహరీ నిర్మాణం, వంటగది, డిజిటల్ లైబ్రరీ నిర్మాణాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో సెక్రెటరీ అరుణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే



లేపాక్షి: గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది



హిందూపురం: చిన్నారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం/లేపాక్షి: హిందూపురం పట్టణంలోని 2వ వార్డు చౌడేశ్వరీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చైర్‌పర్సన్ ఇంద్రజ, సీడీపీఓ రెడ్డి రమణమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి చిన్నారుల భవిష్యత్తుకు పునాదులు వేయడంతో పాటు ఎదుగుదలకు పౌష్టికాహారం అందించడానికి అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రయివేట్ క్వాన్వెంట్స్‌కు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం, ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారని చెప్పారు. లేపాక్షి మండలంలోని కంచిసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య ముగించుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ రెడ్డిరమణమ్మ, సూపర్‌వైజర్ జయమ్మ, మహిళా పోలీస్ రోజావతి, వెల్ఫేర్ అసిస్టెంట్ శివరాం, అంగన్‌వాడి కార్యకర్తలు శాంతమ్మ, రూప, సుజిత, సుమ, శశికళ, గాయిత్రీ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జూలై 1 నుంచి 'అన్న భాగ్య'

- ఒక్కో వ్యక్తికి ఉచితంగా 10 కేజీల బియ్యం అందించేందుకు కర్ణాటక ప్రభుత్వం చర్యలు

పావగడ: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జూలై 1వ తేదీ నుంచి కర్ణాటక ప్రభుత్వం 'అన్న భాగ్య' పథకాన్ని ప్రారంభించనుంది. అన్న భాగ్య పథకంలో భాగంగా ఒక్కో వ్యక్తికి ఉచితంగా 10 కేజీల బియ్యాన్ని అందజేయనున్నారు. తాలుకాలోని రేషన్ డిపోల్లో బియ్యం నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక ఆహార సరఫరా శాఖ అధికారి కృష్ణమూర్తి తెలిపారు. తాలూకా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 83 రేషన్ డిపోలు ఉండగా.. పట్టణంలో 8 ఉన్నాయి. అదే విధంగా పట్టణంలో 6,534 కుటుంబాలు ఉండగా అంత్యోదయ కార్డుదారులు 214, బీపీఎల్ 6021, ఏపీఎల్ 309 మొత్తం 6,544 మంది కార్డుదారులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 49,118 కుటుంబాలు ఉండగా అంత్యోదయ 5,695, బీపీఎల్ 48,915, ఏపీఎల్ 1,049 మొత్తం 55,659 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. తాలూకాలో మొత్తం 62,203 మంది కార్డుదారులకు కుటుంబంలో ఒక్కో వ్యక్తికి 10 కేజీల చొప్పన ఉచిత బియ్యం అందించాల్సి ఉంటుంది.

మడకశిర వద్ద లారీ బోల్తా

- త్రుటిలో తప్పిన ప్రమాదం



మడకశిర: పట్టణ సమీపంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద గురువారం ఉదయం ఓ లారీ బోల్తా పడింది. లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కర్ణాటక నుంచి కొబ్బరి కాయల లోడుతో వస్తున్న లారీ వేగంగా రావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. లారీ కొంత వరకు దెబ్బతింది. డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. త్రుటిలో ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన మార్గోపదేశ ప్రార్థనలు



మాట్లాడుతున్న పాస్టర్లు

పెనుకొండ: పట్టణంలోని బైబిల్ మిషన్ చర్చిలో మార్గోపదేశ ప్రార్థనలు గురువారం ముగిశాయి. అనంతపురం జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నెహమ్యా నాగరాజు పాల్గొని దైవ సందేశమిచ్చారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడచి యేసు ప్రభువు కృపకు పాత్రులు కావాలనిపాస్టర్లు దైవాదీనం, విజయరాజు, బిషప్, అనిల్‌కాంత్ కోరారు.

గడ్డపారలు అందజేయాలి

లేపాక్షి: వంద రోజుల ఉపాధి పని పూర్తి చేసుకున్న తమకు వెంటనే గడ్డపారలు పంపిణీ చేయాలని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరసింహనాయుడు మాట్లాడుతూ.. వంద రోజులు పనులు చేసిన ఉపాధి కూలీలకు త్వరలోనే గడ్డపారలు పంపిణి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కూలీలు నిరసన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్మిక సంఘం సభ్యుడు ప్రవీణ్‌కుమార్, ఉపాధి కూలీలు, స్థానిక సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ద్విచక్ర వాహనం

సోమందేపల్లి: మండలంలోని పత్తికుంటపల్లి సమీపంలో గురువారం సాయంత్రం కారును వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. కదిరి వైపు వెళుతున్న కారు రోడ్డుపై ఆపి ఉండగా.. గోరంట్ల మండలం సామనపల్లికు చెందిన రామాంజి నాయక్, మనోజ్ ద్విచక్ర వాహనంతో ఢీకొట్టారు. ఈ ఘటనలో రామాంజి నాయక్ తలకు తీవ్ర గాయాలు కాగా.. మనోజ్ స్వల్ప గాయాలపాలయ్యాడు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూలీల శాతం పెంచండి

గుడిబండ: మండలంలో ఉపాధి పనులకు కూలీల శాతం పెంచాలని ఎంపీడీఓ రామారావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉపాధి పని కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో గ్రామసభలు ఏర్పాటు చేసి ఉపాధి పనులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ భార్గవి, ఈసీ లక్ష్మానాయక్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రేపు శ్రీసత్యసాయి భజన మండలి ప్రారంభం

లేపాక్షి: శ్రీసత్య సాయిబాబా ఆశీస్సులతో లేపాక్షి శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ ఉదయం మండలంలోని మద్దిపి, మధ్యాహ్నం నాగానపల్లి గ్రామాల్లో శ్రీసత్యసాయి భజన మండలి ప్రారంభిస్తున్నట్లు శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి హాజరవుతారన్నారు.

ప్రశాంతంగా జీవించాలి

చిలమత్తూరు: గ్రామాల్లో ప్రజలెవ్వరూ గొడవల జోలికి వెళ్లవద్దని ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం రాత్రి మండలంలోని సోమఘట్టలో పోలీసులు పర్యటించి గ్రామసభ నిర్వహించారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నారు. మద్యానికి బానిసలు కాకూడదని సూచించారు. మద్యం అక్రమ విక్రయాలు, జూదరులపై సమాచారం ఇవ్వాలని సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

రొద్దం: మండలంలోని సానిపల్లి సమీపాంలోని పేకాట స్థావరంపై గురువారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసి, రూ.16 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.